# కార్పొరేట్‌కు దీటుగా సర్కారు వైద్యం

## తెలంగాణ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు



నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్




నల్లగొండలోని జిల్లా కేంద్ర దవాఖాన

**సమైక్య పాలనలో దుర్భ రంగా ప్రభుత్వ దవాఖానలు**

**స్వరాష్ట్రంలో సరికొత్త రూపు.. అత్యాధునిక వైద్య సేవలు**

**కిడ్నీ బాధితులకు ఆపన్నహస్తంలా డయాలసిస్ కేంద్రాలు**

**మారుమూల పల్లెల్లోనూ మెరుగైన వైద్య సేవలు**

*నీలగిరి, నవంబర్ 8 :* సమైక్య పాలనలో కునారిల్లిన ప్రజా వైద్యంలో.. నేడు స్వరాష్ట్రంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకవైపు బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు, కంటి వెలుగు, ఎన్‌సీడీ కిట్లు, కేసీఆర్ కిట్, అమ్మఒడి, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి అమలు చేస్తున్నారు. మరోవైపు రోగులకు అనుగుణంగా వైద్యులను నియమించడంతోపాటు మందులు, ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తెచ్చారు. డయాలసిస్ రోగుల కోసం జిల్లా జనరల్ ఆస్పత్రితోపాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్‌లో డయాలసిస్ సెంటర్లు, జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో క్యాన్సర్, డయాలసిస్ సెంటర్లు, ఐసీయూ, ఎంసీహెచ్‌ను ఏర్పాటు చేసి ఇక్కడే చికిత్స అందిస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో రూ.270 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారు. పీహెచ్‌సీలను సైతం ఆధునీకరించి 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ప్రతి మంగళవారం 'ఆరోగ్య మహిళ' పేరుతో దీర్ఘకాలిక రోగాలపై ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

### కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు

ఉమ్మడి పాలనలో సర్కారు దవాఖానకు వెళ్లాంటేనే ప్రాణాల మీద ఆశలు వదులుకోవాల్సి వచ్చేది. ఆర్థిక స్థోమత లేక తప్పని పరిస్థితిలో వెళ్లాల్సి వచ్చేది. సిబ్బంది కొరత తదితర కారణాలతో రోగులు మృత్యువాత పడేవారు. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. దాంతో వాటి రూపురేఖలు పూర్తిగా మారాయి. అంతేకాకుండా కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి వంటి పథకాలతో సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగడమే కాకుండా సిజేరియన్ల సంఖ్య తగ్గుముఖం పట్టింది.



ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

### కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆపన్న హస్తం

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానతోపాటు నాగార్జునసాగర్, దేవరకొండ, మిర్యాలగూడ ఏరియా ఆస్రత్రుల్లోనూ డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటిల్లో ప్రతిరోజూ 40 నుంచి 50 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు అందుతున్నాయి. సాధారణంగా డయాలసిస్ చేయించాలంటే కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.3 నుంచి 5 వేల వరకు ఖర్చవుతుంది. కొందరికి వారానికి ఒకటి లేదా రెండుసార్లు చేయాల్సి ఉంటుండగా, మరికొందరికి నెలలో ఒకటి లేదా రెండుసార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. దాంతో ఒక రోగికి ప్రతినెలా సుమారు రూ.12 వేల నుంచి 40 వేల వరకు ఆర్థిక భారం పడనున్నది. నిరుపేదలు ఈ భారం భరించలేక ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలోనే రాష్ట్ర సర్కారు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆపన్నహస్తం అందిస్తున్నది. అంతేకాక గతంలో ఒక డయాలసిస్ కిట్(డయలైజర్)ను అనేకసార్లు వినియోగించేవారు. దాంతో ఇన్‌ఫెక్షన్ వచ్చి అనారోగ్యానికి గురయ్యేది. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా డీమేడ్ సెంటర్లు ఏర్పాటు చేసి సింగిల్ యూజ్డ్ డయలైజర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంతో ఒక డయలైజర్‌ను ఒకేసారి వినియోగిస్తున్నారు.

### పల్లెల్లోనూ మెరుగైన వైద్య సేవలు

జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ డివిజన్‌లలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు, ఐసీయూలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించారు. మర్రిగూడలో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు చేశారు. నకిరేకల్ ఆస్పత్రిని 100 పడకలకు పెంచారు. నూతనం భవనం కోసం 6 ఎకరాల భూమిని సైతం కేటాయించగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవే కాకుండా జిల్లాలో 18 పీహెచ్‌సీలను ఆధునీకరించి 24 గంటలపాటు వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. మిర్యాలగూడలో 30 పడకలతో చిన్నారుల కోసం ప్రత్యేకంగా వార్డును ఏర్పాటు చేశారు. అదనంగా 100 పడకలు పెంచి రూ.15 కోట్లతో పనులు చేపట్టారు.

### సకల సౌలత్‌లతో జిల్లా కేంద్ర ఆస్పత్రి

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్ర దవాఖానను 250 పడకల నుంచి 400 పడకలకు పెంచారు. అంతేకాకుండా ఎంసీహెచ్‌ను ఆధునీకరించి అదనంగా 150 పడకలను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తం 550 పడకలతో ప్రస్తుతం జిల్లా జనరల్ ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతున్నది. 10 పడకలతో ఐసీయూ, 10 పడకలతో డయాలసిస్ సెంటర్, మరో 10 పడకలతో పాలియేటివ్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా 12 పడకలతో ఐసీయూను ఏర్పాటు చేశారు. కరోనా కాలంలో రెండు ఆక్సిజన్ ప్లాంట్లను ప్రభుత్వ ఆధ్వర్యంలో, ఒకటి నేషనల్ హైవే అథారిటీ సహకారంతో ఏర్పాటు చేసి 550 పడకలకు ఆక్సిజన్ అందేలా చర్యలు తీసుకున్నారు. వీటితోపాటు రూ.కోటితో సీటీస్కాన్ మిషన్, రూ.40 లక్షలతో ఎక్స్‌రే మిషన్, మరో రూ.20 లక్షలతో మోకాలి శస్త్ర చికిత్సకు ఆపరేషన్ థియేటర్, మార్చురీ రూమ్‌ను ఆధునీకరించారు. అంతేకాకుండా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి తాత్కాలికంగా రూ.7కోట్లతో భవనాన్ని ఏర్పాటు చేసి గత నాలుగేండ్లుగా ఏటా 150 మంది చొప్పున 600 మంది వైద్య విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ల్యాప్రోస్కోపిక్, తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్‌ను ఏర్పాటు చేశారు.

### పెరిగిన మనిషి ఆయు ప్రమాణం

తెలంగాణ ప్రభుత్వం సాధారణ ప్రసవాలపై దృష్టి సారించింది. అన్ని ఆస్పత్రులను బలోపేతం చేయడంతోపాటు 18 పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేసి 24 గంటలపాటు వైద్యులను అందుబాటులో సేవలు అందిస్తున్నది. కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగి మాతాశిశు మరణాలు తగ్గాయి. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా ఎన్‌సీడీ కిట్లు అందిస్తున్నారు. దీర్ఘకాలిక రోగాలైన క్యాన్సర్, ఎయిడ్స్, టీబీ వ్యాధిగ్రస్తులకు కూడా ఇంటింటికి వెళ్లి మందులు అందిస్తున్నారు. వీటన్నింటి కారణంగా మనిషి జీవిత కాలం 60 నుంచి 65 ఏండ్లకు పెరిగింది.

### బస్తీ, పల్లె దవాఖానలు..

గతంలో ప్రజలకు సుస్తీ చేస్తే ప్రైవేట్ దవాఖానలే దిక్కయ్యేవి. ప్రభుత్వ వైద్యసేవలు అందుబాటులో ఉండేవి కావు. ఇప్పుడు పట్టణాల్లో సకల సౌలత్‌లతో బస్తీ దవాఖానలు, పల్లెల్లో పల్లె దవాఖానలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 5 వేల జనాభా కలిగిన 195 సబ్‌సెంటర్లను పల్లె దవాఖానలుగా మార్చడంతోపాటు నూతనంగా 7 పీహెచ్‌సీలు, 5 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశారు.

### క్యాన్సర్ రోగులకు పాలియేటివ్ కేర్ యూనిట్

ప్రాణాంతర మైన మహమ్మారి క్యాన్సర్ బారిన పడి ఎంతో మంది చనిపోతున్నారని గ్రహించిన సీఎం కేసీఆర్ నల్లగొండ జిల్లా కేంద్రంలో పాలియేటివ్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయించారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా 20 పడకలతో అన్ని రకాల వసతులతో యూనిట్‌ను ఏర్పాటు చేసి జిల్లాలో 182 మంది ఇన్‌పేషెంట్లకు, 245 ఔట్ పేషెంట్లకు చికిత్స అందిస్తున్నారు.

### డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో ఆర్థిక ఇబ్బందులు తప్పాయి

నా పేరు బొడ్డుపల్లి కవిత. నా వయసు 42ఏండ్లు. నేను గత తొమ్మిదేండ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నా. రెండు కిడ్నీలు పాడవడంతో ఏడేండ్ల నుంచి డయాలసిస్ చేయించుకుంటూ జీవనం సాగిస్తున్నా. అప్పట్లో సరైన వైద్యం లేక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిపైనే ఆధారపడడంతో మెరుగైన వైద్యం అందక రెండు కిడ్నీలు పడాయ్యాయి. నా భర్త చిరు ఉద్యోగి. ఆయనకు వచ్చే జీతంతో కుటుంబ ఖర్చులు, పిల్లల చదువు, నా ఆరోగ్యం ఖర్చుతో ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. అప్పుడు నల్లగొండలో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లేవాళ్లం. 2016 నుంచి నిమ్స్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకున్నా. వారంలో మూడుసార్లు చేయించుకునే దాన్ని. ఇక్కడి నుంచి ఎల్‌బీనగర్‌కు మూడు గంటలు, అక్కడి నుంచి నిమ్స్‌కు రెండు గంటలు పట్టేది. ఒక్కొక్కసారి నాభర్త ఆఫీస్‌లో బిజీగా ఉంటే నేను కారు కిరాయికి తీసుకెళ్లేదాన్ని. వారంలో రెండుసార్లు బస్సుకు, ఒకసారి అద్దెకారులో పోయేవాళ్లం. నిమ్స్ ఆస్పత్రిలో కూడా ఇంజక్షన్లు ఉచితంగా ఇచ్చేవారు కాదు. బయట కొనుక్కునేవాళ్లం. ఇంజక్షన్లకు రూ.500 ఖర్చు అయ్యేవి. డయాలసిస్ జరుగుతున్న సమయంలో వాంతులు, ఇతర సమస్యలు వస్తే ఇచ్చే ఇంజక్షన్లకు మరో రూ.500 అయ్యేవి. నా భర్తకు వచ్చే 18వేల జీతంలో 10 నుంచి 12 వేలు నాకే ఖర్చు అయ్యేవి. మిగతా డబ్బుతో కుటుంబ అవసరాలు తీరేవి కావు. కొన్నిసార్లు డయాలసిస్‌కు వెళ్లేందుకు డబ్బులు ఉండేవి కాదు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సార్ నల్లగొండలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయించడంతో గత నాలుగేండ్లుగా ఇక్కడే ఉచితంగా వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. పైసా ఖర్చు లేకుండా అంతా ఉచితంగానే చేస్తున్నారు. దాంతో మాకు ఆర్థికభారం తప్పింది. సీఎం కేసీఆర్ సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– బొడ్డుపల్లి కవిత, డయాలసిస్ పేషెంట్, నల్లగొండ





జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని అత్యాధునిక వైద్య పరికరాలు

### ప్రతి మంగళ వారం ఆరోగ్య మహిళ

మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం అందిచాలనే లక్ష్యంతో వారంలో ఒకరోజు మహిళలకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి మంగళవారం 'ఆరోగ్య మహిళ' పేరుతో కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఒకటి చొప్పున పీహెచ్‌సీలను ఏర్పాటు చేసి ఉచితంగా ఎనిమిది రకాల పరీక్షలు చేస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, ఇతర సాధారణ పరీక్షలు, ఓరల్ సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, థైరాయిడ్, సూక్ష్మ పోషకాహార లోపాలు, అయోడిన్ సమస్యలు తదితర పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 5,690 మందికి పరీక్షలు చేశారు.